క్లుప్తంగా

మంచిర్యాల రూరల్ సీఐగా ఆకుల అశోక్



నస్పూర్: మంచిర్యాల రూరల్ సీఐగా ఆకుల అశోక్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు. కాగా అశోక్ సీసీఆర్‌బీ రామగుండం నుంచి ఇక్కడికి బదిలీ కాగా, ఇక్కడ పనిచేస్తున్న టి.సంజీవ్ ఐజీ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు.

ముగిసిన గుడిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేటలో లగిశెట్టి రామక్క–గోపాల్ జ్ఞాపకార్థం వారి కుమారుడు లగిశెట్టి రాజయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గుడిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. గుడిపేట, నంనూర్ గ్రామాలకు చెందిన 5 క్రికెట్ జట్లు పోటీల్లో తలపడ్డాయి. ఫైనల్‌కు చేరిన గుడిపేట–గుడిపేట ఎలెవెన్ జట్లు తలపడగా ఆద్యంతం ఆసక్తిగా సాగగా ఇరు జట్లు స్కోరు సమం చేయగా సూపర్ ఓవర్ ద్వారా విజేత ఎంపిక చేపట్టారు. సూపర్ ఓవర్‌లో విశేషంగా రాణించిన గుడిపేట జట్టు విజేతగా నిలవగా విజేతలకు లగిశెట్టి రాజయ్య ట్రోఫీతోపాటు నగదు బహుమతి అందజేశారు. రైల్వే ఎస్సై తిప్పని సుధాకర్, ముడిమడుగుల శ్రీనివాస్, కందుల రమేశ్, కిలిశెట్టి మురళీ, భరత్ పాల్గొన్నారు.

కేజీబీవీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్నా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంచిర్యాల ఎంఈవో పోచయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ మంచిర్యాలలో స్కావెంజర్, నస్పూర్ కేజీబీవీలో అసిస్టెంట్ కుక్, కేజీబీవీ హాజీపూర్ డై స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. స్థానిక మండలానికి చెందిన మహిళలు అర్హులని, గత సెప్టెంబర్ 1 నాటికి 18 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఏడో తరగతి సర్టిఫికెట్‌తో ఫిబ్రవరి 2లోగా ఉదయం 10 గంటలకు మండల విద్యావనరుల కేంద్రంలో సమర్పించాలని సూచించారు.

కలెక్టరేట్ ముట్టడి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ ఏడాదిగా మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వార్డెన్లు అప్పులు చేసి హాస్టళ్లు నడుపుతున్నారన్నారు. మంచిర్యాలలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, బెల్లంపల్లిలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, మహిళా డిగ్రీ కళాశాల, ఐటీఐ ఏర్పాటు చేయాలన్నారు. చెన్నూర్‌లో ఎస్సీ బాలికలు, బాలుర కాలేజీ, హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందించారు.

వేతనాల కోసం..



నిరసన తెలుపుతున్న మెప్మా ఆర్పీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: పట్టణ పేదిరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఏఆర్‌పీ, రిసోర్స్ పర్సన్ల ఏడు నెలల వేతనాలు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు అరుణ, రుక్మిణిదేవి మాట్లాడుతూ గత జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నెలకు రూ.4 వేలు, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు నెలకు రూ.6 వేల చొప్పున వేతనాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. నిరసనలో రాకుమారిదేవి, విజయలక్ష్మి, అరుణ, రుమణ, మౌనిక, రజిని, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

చెన్నూర్: చెన్నూర్‌తోపాటు మండలంలోని వరలక్ష్మి, ఆదిశంకరాచార్య, చెన్నూర్ కాటన్, జీఆర్‌ఎస్ పత్తి మిల్లుల్లో పత్తి నిల్వలు నిండిపోయాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు, సీపీవో ఉదయ్‌షా తెలిపారు. జిన్నింగ్ మిల్లుల్లో ఫిబ్రవరి 1 నుంచి సీసీఐ ద్వారా కొనుగోళ్లు బంద్ చేస్తున్నామని పేర్కొన్నారు. తిరిగి కొనుగోళ్లు ప్రారంభించే తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

గెలిచేనా.. ఓడేనా?

- నేడు అవిశ్వాస తీర్మానం
- క్యాంపులో డైరెక్టర్లు
- కోర్టు స్టే కోసం చైర్మన్ ప్రయత్నం



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

జన్నారం: జన్నారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం మంగళవారం జరగనుంది. ఈ తీర్మానంలో గెలిచేదెవరో..ఓడేదెవరో ఉత్కంఠ నెలకొంది. 10 మంది డైరెక్టర్లు క్యాంపునకు తరలివెళ్లారు. మరోవైపు చైర్మన్ కోర్టు నుంచి స్టే తెచ్చే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది.

క్యాంపులో డైరెక్టర్లు

2020 ఫిబ్రవరి 16న జన్నారం పీఏసీఎస్ ఎన్నికలు జరిగాయి. డైరెక్టర్లుగా 13 మంది ఎన్నికయ్యారు. చైర్మన్‌గా శీలం రమేశ్, వైస్ చైర్మన్‌గా మహిపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. అయితే ఇటీవల కొందరు డైరెక్టర్లు చైర్మన్‌పై వ్యతిరేకంగా ఉన్నారు. ఈక్రమంలో నూతన ప్రభుత్వం ఏర్పడడం వల్ల కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన డైరెక్టర్లే కొందరు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడం గమనార్హం. ఈక్రమంలో మంచిర్యాల ఇన్‌చార్జి డీసీవో శ్రీనివాసరెడ్డికి, హైదరాబాద్‌లోని రాష్ట్ర కోపరేటివ్ రిజిస్ట్రార్‌కు 9 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాన కోసం ఫిర్యాదు చేశారు. చైర్మన్ శీలం రమేశ్ కోర్టును ఆశ్రయించగా ఈనెల 29 వరకు తాత్కాలిక స్టే ఇచ్చింది. అధికారులు 30న సమావేశం ఏర్పాటు చేసి బలం నిరూపణ చేసుకోవాలని డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్‌కి నోటీసులు జారీచేశారు. దీంతో చైర్మన్ పదవి ఆశిస్తున్న అల్లం రవి రెండు రోజుల ముందే 9 మంది డైరెక్టర్లతో క్యాంప్‌నకు తరలివెళ్లారు. మంగళవారం ఉదయం నేరుగా పీఏసీఎస్ కార్యాలయానికి రానున్నట్లు అల్లం రవి తెలిపారు.

స్టే కోసం ప్రయత్నం

ఇదిలా ఉండగా, కోర్టు ముందుగా ఈనెల 29 వరకు తాత్కాలిక స్టే ఇవ్వగా, స్టే పొడగించే ప్రయత్నంలో చైర్మన్ ఉన్నట్లు తెలిసింది. అవిశ్వాసం పెట్టిన రోజే స్టే పొడగింపు కోసం ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సందర్భంగా ‘సాక్షి’చైర్మన్ శీలం రమేశ్‌ను సంప్రదించగా.. చైర్మన్‌గా ఎన్నికైన నుంచి తాను రైతుల శ్రేయస్సు కోసం పని చేశానని, రైతుల సౌకర్యం కోసం ప్రధాన రహదారి వైపునకు ఫర్టిలైజర్ అందుబాటులో ఉంచానని చైర్మన్ తెలిపారు. డైరెక్టర్లతో తనకు ఎలాంటి విభేదాలు లేవని, కొందరు మాటలు విని వారు క్యాంప్‌నకు వెళ్లినట్లు పేర్కొన్నారు. అవిశ్వాసంలో కోర్టు స్టే రాకున్నా తాను గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఉన్నతాధికారుల ఆదేశాలతో అవిశ్వాస తీర్మాన కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లా అధికారులు కార్యాలయానికి వచ్చి పలు సూచనలు చేశారు. పోలీసు బందోబస్తు కోసం పోలీసులకు దరఖాస్తు చేశాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. మంగళవారం అవిశ్వాస తీర్మానం జరగనుంది.
– రాజన్న, సీఈవో, పీఏసీఎస్, పొనకల్

బీఆర్ఎస్ సమీక్షా సమావేశంపై దృష్టి

- సమావేశానికి కౌన్సిలర్లు గైర్హాజరయ్యే అవకాశాలు
- ముఖ్య నాయకుడి తీరుపై శ్రేణుల అసంతృప్తి

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూసిన బీఆర్ఎస్ కారణాలను సమీక్షించుకుని గులాబీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో సమీక్షా సమావేశాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో తొలి సమీక్ష సమావేశాన్ని మంగళవారం బెల్లంపల్లిలో నిర్వహించడానికి సిద్ధపడ్డారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ముఖ్య అతిథిగా హాజరు కానుండగా ఇతర నాయకులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. కాగా, మున్సిపాలిటీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు నాయకులు అనుసరించిన తీరుతో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, ద్వితీయశ్రేణి నాయకులు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై అవిశ్వాసాన్ని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రకటించగా ఓ ముఖ్య నాయకుడు కనీస మద్దతు ఇవ్వకపోగా, అవిశ్వాసం వీగిపోవడానికి తనవంతు సహకారం అందజేసినట్లు స్వయంగా ఆ పార్టీ కౌన్సిలర్లు విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. అంతటితో సరిపెట్టకుండా ఆ నాయకుడి తీరుకు విసుగుచెందిన 20 మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. వారంతా ఏ పార్టీలో చేరకుండా ప్రస్తుతం తటస్థంగా ఉండగా మున్సిపల్ కౌన్సిలర్ల మాదిరిగానే గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఒకరిద్దరు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, గ్రామనాయకులు అసంతృప్తితో ఉన్నట్లుగా గులాబీశ్రేణులు చర్చించుకుంటున్నారు.

బుజ్జగించిన దారికి రాని కౌన్సిలర్లు..!

అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లను ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దండే విఠల్ బెల్లంపల్లికి వచ్చి జరిగిన పరిణామాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఐదేళ్లలో పార్టీని నమ్ముకుని ఏ విధంగా నష్టపోయారో, ముఖ్య నాయకుడు ఎంతగా మోసం చేశాడో వివరించినట్లు తెలుస్తోంది. కౌన్సిలర్ల ఆవేదన, ఆక్రందనను సావధానంగా ఆలకించిన ఎమ్మెల్సీ విఠల్ సర్దిచెప్పే యత్నాలు చేయగా అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు ససేమిరా అన్నట్లుగా తెలుస్తోంది. చివరికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకువెళ్తానని విఠల్ హామీ ఇచ్చినట్లుగా చెబుతున్నారు. అయితే తమకు అన్యాయం చేసిన నాయకుడిపై చర్యలు తీసుకుంటే కాని సమీక్ష సమావేశానికి హాజరుకాలేమని, లేదంటే తమదారి తాము చూసుకుంటామని ఎమ్మెల్సీకి ఖరాఖండిగా చెప్పినట్లు సమాచారం. ఈమేరకు మంగళవారం జరిగే సమీక్ష సమావేశానికి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన అసమ్మతి కౌన్సిలర్లు గైర్హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ పరిస్థితులను బీఆర్‌ఎస్ అధిష్టానం ఏ తీరుగా చక్కదిద్దుతుందనేది ఆసక్తికరంగా మారింది.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



నెన్నెలలో ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

నెన్నెల: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రిసైడింగ్ అధికారి (అడిషనల్ డీఆర్‌డీవో) దత్తరావు అధ్యక్షతన 13వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ రమాదేవి హాజరయ్యారు. 2022–23 సంవత్సరం వరకు 19 గ్రామ పంచాయతీల్లో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.3 కోట్ల 23 లక్షల 85 వేలను కూలీలకు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఉపాధిహామీ సామగ్రి కింద రూ.80 లక్షల 43 రూపాయలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఆర్పీలు వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులకు సంబంధించిన నివేదికలు చదివి వినిపించారు. వివిధ గ్రామాల్లో, క్రీడా ప్రాంగణాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేసిన పనులపై రూ.6,749లను రికవరీ చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ ఆదేశించారు. కొన్నిచోట్ల ఎక్కువ మొక్కలు నాటినట్లు రికార్డుల్లో చూపగా క్షేత్రస్థాయిలో తక్కువ మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. మస్టర్లలో, రికార్డుల్లో వివరాలు సరిగా నమోదు చేయకపోవడం తదితర విషయాలను డీఆర్పీలు ప్రజావేదికలో వెల్లడించారు. ఈ తీరుపై అడిషనల్ డీఆర్‌డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ అధికారి శివరాం, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి శంకరమ్మ, జిల్లా విజిలెన్స్ అధికారి సురేష్, అసిస్టెంట్ జిల్లా విజిలెన్స్ అధికారి కిరణ్, సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ సాయిలు, ఎంపీడీవో వరలక్ష్మి, అదనపు ప్రోగ్రాం అధికారి నరేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిదులు, ప్రజలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



జన్నారం: ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు



దండేపల్లి: విద్యార్థులను అభినంధిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

కాసిపేట: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మండల స్థాయిలో సోమవారం కాసిపేట జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన డ్రామా, స్పెల్ విజార్డ్ పోటీల్లో విద్యార్థులు సత్తాచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈఎల్‌టీఏ(ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్–తెలంగాణ) ఆధ్వర్యంలో పాఠశాల నుంచి మండల స్థాయికి గెలుపొందిన వారికి పోటీలు నిర్వహించారు. డ్రామాపోటీల్లో జెడ్పీహెచ్ఎస్ దేవాపూర్ విద్యార్థులు మహిమ, ఆర్యన్, ప్రీతికుమారి, అంజలికుమారి, తినియా, కేజీబీవీ విద్యార్థులు శివాని టీం జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్పెల్ విజార్డ్‌లో రిషిత జెడ్పీహెచ్ఎస్ ధర్మరావుపేట, ధరణి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్‌వో మూర్తి, చౌదరి, హెచ్ఎం సాంబమూర్తి, ఈఎల్‌టీఏ కన్వీనర్ అష్మద్‌పాషా, కోకన్వీనర్ అరుణకుమారి పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. స్పెల్ విజార్డ్ పోటీల్లో కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్షర (ప్రథమ), కలమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థి అంజన్ (ద్వితీయ) స్థానంలో నిలిచారు. డ్రామా పోటీల్లో మురిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు (ప్రథమ), కిష్టాపూర్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇంగ్లిష్ భాషా ఫోరం మండల కన్వీనర్ కమలాకర్, హెచ్ఎం కొండు జనార్దన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో సోమవారం ఆంగ్ల ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఆంగ్ల భాషలో తప్పులు లేకుండా రాయడంపై నిర్వహించిన పోటీల్లో వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీవైష్ణవికి (ప్రథమ), రెబ్బనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని హిమవర్షిణి (ద్వితీయ) స్థానంలో నిలిచారు. ఆంగ్ల నాటక ప్రదర్శనలో వెల్గనూర్ విద్యార్థులు (ప్రథమ), మామిడిపల్లి విద్యార్థులు (ద్వితీయ) స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్ఎంలు శంకర్‌గౌడ్, విజయలక్ష్మి, రాజు, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

నస్పూర్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నస్పూర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని పద్మావతి కల్యాణ మండపంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో సీసీసీలోని బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సింగిల్ కటాస్, టీం కటాస్ విభాగంలో రమాకాంత్, మహ్మద్, రెహాన్, ఉత్తమనంద, అశ్రిత, నందన, అన్విత్, రాకేశ్, అవని, నేహా, సాన్వి,శ్రీహరిణి, మన్మిత, జోష్ణ, తదితరులు బహుమతులు సాధించగా వారిని కరస్పాండెంట్ సత్యనారాయణ, మాస్టర్ రంగ రమేశ్ అభినందించారు.

కోటపల్లి: మండలానికి చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభచాటారు. మంచిర్యాల జిల్లా పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ షిప్ పోటీలకు ఉషోదయ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ పట్టెం తిరుపతి తెలిపారు. బాలుర విభాగంలో ప్రథమస్థానంలో చందన్ (బంగారు), జలంపల్లి కృష్ణ కౌశిక్ (వెండి), కుందారపు రిశ్వంత్ (కాంస్య) పతకాలు సాధించారు. బాలికల విభాగంలో అక్షయ (బంగారు), సహస్ర (వెండి), శృతిక (కాంస్య) పతాకం సాధించినట్లు హెచ్ఎం ఉమారాణి తెలిపారు.

భీమిని: జిల్లా కేంద్రంలో అదివారం రాత్రి నిర్వహించిన పీఎస్ఆర్ కరాటే పోటీల్లో కన్నెపల్లి కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. పోటీల్లో 19 మంది పాల్గొన 7 గురు గోల్డ్‌మెడల్, 6 మంది విద్యార్థులకు సిల్వర్, 6 మంది విద్యార్థులకు బ్రాడ్ మెడల్ సాధించినట్లు ప్రత్యేక అధికారి వినిత, కరాటే మాస్టర్ రాజేశ్ తెలిపారు.

బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడిగా యుగంధర్

శ్రీరాంపూర్: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కె.యుగంధర్ సాయి ఎన్నికయ్యారు. నస్పూర్ కాలనీలోని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు పరంధాములు, ఉపాధ్యక్షుడు సత్తయ్య ప్రధాన కార్యదర్శి శీలం ప్రభాకర్ హాజరయ్యారు. బుద్ధిస్ట్ సొసైటీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు, బుద్ధుని భావజాలాన్ని విస్తృత పరిచినందుకు యుగేంధర్‌సాయిని జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి వేల్పుల ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వేముల కిరణ్, నాయకులు పల్లె మల్లయ్య, గోషిక మల్లేశ్, సూరమళ్ల రామచందర్, లచ్చన్న, శంకర్ తోటపల్లి భూమన్న, సుమోహన్ పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పాతమంచిర్యాల: యాదవుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ కోరారు. జిల్లా కేంద్రంలో సంఘం నాయకులతో సోమవారం సమావేశమై మాట్లాడారు. రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వంశీమోహన్, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శి సతీశ్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి శ్యాం యాదవ్, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రడగంబాల బస్తీలో ఎమ్మెల్యే కార్యాలయం

బెల్లంపల్లి: బెల్లంపల్లి రడగంబాల బస్తీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ఇతర సమస్యలు ఏమున్నా కార్యాలయంలో సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పరామర్శ

బెల్లంపల్లి: అనారోగ్యంతో ఇటీవల అకాల మృతిచెందిన తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సొల్లేటి రాజిరెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి వేర్వేరుగా వెళ్లి పరామర్శించారు. బెల్లంపల్లి బాబు క్యాంపుబస్తీలో నివాసం ఉంటున్న ఇంటికి వెళ్లి రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు పైడాకుల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్ మాజీ సర్పంచ్ కోవ రాజు సతీమణి లింగుబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సోమవారం రాజు కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, స్థానికులు పాల్గొన్నారు.

పెరిగిన వేతనాలు చెల్లించాలని వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఎలక్ట్రీషన్స్, ఫిట్టర్స్, డ్రైవర్స్, శానిటేషన్ వర్కర్స్‌కు జీవో నంబర్ 40 ప్రకారం వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ బి.సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని కోరుతూ స్థానికులు జిల్లా కలెక్టర్ సంతోశ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు గడ్డం సతీశ్‌యాదవ్ ఉన్నారు.

నూతన కార్యవర్గం

మందమర్రిరూరల్: మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో టీఎన్జీవో జైపూర్, మందమర్రి (యూనిట్) నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి సోమవారం ప్రకటించారు. యూనిట్ అధ్యక్షుడిగా సుమన్, ఉపాధ్యక్షుడిగా భిక్షపతి, కార్యదర్శిగా సీహెచ్ సతీశ్, సంయుక్త కార్యదర్శిగా జి.విద్యాలత, నిర్వహణ కార్యదర్శిగా పి కిశోర్, ప్రచార కార్యదర్శిగా ప్రసన్నకుమార్, కోశాధికారిగా ఏ సురేష్, కార్యనిర్వాహక సభ్యులుగా విజయలక్ష్మి, జి.అమరేందర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా కమిటీ సన్మానించి అభినందించారు. ఎన్నికల అధికారిగా శ్రావణ్‌కుమార్ వ్యవహరించారు.

నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రతలో భాగస్వామ్యమవుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకుంటారని ఎంవీఐ రాహుల్‌కుమార్ అన్నారు. వేంపల్లిలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలకు సంబంధించి ప్రచార కరపత్రాలు వాహనదారులకు అందజేస్తూ ఆటోలు, మోటార్ సైకిళ్లకు సోమవారం స్టిక్కర్లను అంటించారు. అనంతరం అవగాహ న కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మా ట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీ వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో అందరినీ భాగస్వాములు చేస్తామన్నారు.

నర్సరీల సందర్శన

భీమారం: మండలంలోని ఆరెపల్లి, భీమారం మొక్కల నర్సరీలను ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. జూలైలో జరిగే హరిత హారంలో ప్రజలకు ఉచితంగా అందించేందుకు మొక్కలు పెంచుతున్నామని ఎంపీడీవో తెలిపారు. ప్రతీ మొక్క సంరక్షించాలని కార్యదర్శులను ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

భీమారం: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఇందులో ఒక్క దరఖాస్తు రాలేదు. ప్రజావాణిలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజావాణిపై అధికారులు విస్తృత ప్రచారం చేయాలన్నారు.

చిన్నారి వైద్యానికి చేయూత

తాండూర్: చిన్నారి వైద్యానికి యువభారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. మాదారం గ్రామానికి చెందిన పోలవేణి రవీంద్ర రెండు నెలల కుమారుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. నిరుపేద అయిన రవీంద్ర తన కుమారుడికి మెరుగైన వైద్యం అందించే స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిన ఫౌండేషన్ సభ్యులు రూ.26 వేల నగదును సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి రవీంద్ర దంపతులకు అందజేశారు. ఫౌండేషన్ ఇంచార్జీలు జీవన్ కుమార్, రోషన్, ప్రణీత్ ఉన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు

తాండూర్: జంతుసంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం తాండూర్ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మొదటి రోజు 12 కుక్కలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి మంచాల భూమయ్య తెలిపారు. పశు వైద్య సహాయకుడు నరేశ్, గోపాలమిత్ర కళ్యాణ్, గౌస్ తదితరులు ఉన్నారు.

బీసీ కులగణనపై హర్షం

పాతమంచిర్యాల: బీసీ కులగణన చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు హర్షం వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర థియేటర్ చౌరస్తాలో సోమవారం సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్, నాయకులు మంతెన గట్టయ్య, శ్రీపతిరాములు, కీర్తి భిక్షపతి, లక్ష్మణ్, రామస్వామి, పట్టణ అధ్యక్షుడు మహేశ్ పాల్గొన్నారు.

నూతన పంచాయతీ భవనాలు ప్రారంభం

కోటపల్లి: మండలంలోని కోటపల్లి, సర్వాయిపేట, వెలమపల్లి పంచాయతీ నూతన భవనాలను ఎంపీపీ సురేఖ సోమవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచులను సన్మానించారు. సర్పంచులు రాజక్క, వసంతకుమారి, సత్యనారాయణ, ఎంపీటీసీ సంగీత, నాయకులు విద్యాసాగర్, రాజన్న, రామన్న, రాగంస్వామి, విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం

భీమిని: కన్నెపెల్లి మండలం లింగాల పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం స్థానిక సర్పంచ్ లక్ష్మితో కలిసి ఎంపీపీ సృజనరావు ప్రారంభించారు. మనఊరు–మనబడి కింద పనులు పూర్తయిన లింగాల పాఠశాలను ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల అభివృద్ధిపై పలు తీర్మానాలు చేశారు. వైస్ ఎంపీపీ రాజేశ్వర్మ, ఎంపీడీవో రాధాకృష్ణ, ఎంపీటీసీలు ప్రసాద్‌రావు, భారతి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ అంకూస్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటసభలకు ఎంపిక

చెన్నూర్: భద్రాచలంలో ఫిబ్రవరి 11న నిర్వహించే ఆటసభలకు మంచిర్యాల జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఆట వ్యవస్థాపక అధ్యక్షుడు బెక్కంటి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా నుంచి ఆట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గం రాజేశంగౌడ్, మేకల రామస్వామి, కార్యవర్గ సభ్యులు దబ్బెట రాజమల్లు, మామిడి అక్షిత ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ మేరకు వారికి ఆహ్వానపత్రాలు పంపించినట్లు తెలిపారు.

సీపీఐ వార్డు కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: సీపీఐ నస్పూర్ మున్సిపాలిటీ 4వ వార్డు కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. వార్డు కార్యదర్శిగా చిలుక రామచందర్, సంయుక్త కార్యదర్శిగా దాసరి రాజేశం, సహాయ కార్యదర్శిగా పోతరాజుల విజయ్, కోశాధికారిగా సారంగపాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భక్తుల క్రాంతితోపాటు 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మేకల దాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేశ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.

గ్రామీణ బంద్ విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట: సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు ఫిబ్రవరి 16న నిర్వహించే గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని జిల్లా నాయకుడు కనికరం అశోక్ ఓ ప్రకటనలో కోరారు. కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ బంద్‌లో పాల్గొనాలని కోరారు.

గుడిపేటలో నేత్రదాన సభ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేటలో నేత్రదాత అయిన స్థానికుడు దొమ్మటి రాజయ్య సంస్మరణసభ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, తాను మరణించినా మరొకరికి చూపు ప్రసాదించాలనే సంకల్పంతో రాజయ్య నేత్రదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశివ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు లగిశెట్టి చంద్రమౌళి, దొమ్మటి రాజయ్య, స్థానిక నాయకుడు లగిశెట్టి రాజయ్య, కళాకారులు పాల్గొన్నారు.

టీఎన్జీవో కార్యవర్గం

భీమిని: కన్నెపెల్లి తహసీల్దార్ కార్యాలయంలో డివిజన్ టీఎన్జీవో కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా గోవర్దన్, కార్యదర్శి కె.పద్మనాభం, సంయుక్త కార్యదర్శిగా అలేఖ్య, నిర్వహణ కార్యదర్శిగా కిషన్‌రావు, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్, కోశాధికారి ఎం.వెంకటేశ్వర్, కార్యనిర్వాహక సభ్యులుగా వి.ఆశోక్, ఆర్.బాపు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.

యూత్‌కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట, కొండపూర్(యాప) యూత్ కాంగ్రెస్ గ్రామకమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. ధర్మరావుపేట అధ్యక్షుడిగా రాంపల్లి సదానందం, ఉపాధ్యక్షులుగా రాహుల్, రాంపల్లి కుమార్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు, కొండపూర్ అధ్యక్షుడిగా నరేశ్, ప్రధాన కార్యదర్శిగా పోడేటి చందు, ఉపాధ్యక్షుడిగా ఒల్లెపు రాము తదితరులు ఎన్నికయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖాకేశ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

మందమర్రిరూరల్: పట్టణంలోని యాపల్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుర్రం రాము(42) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. రాము తండ్రి భీమయ్య అస్థికలను కాశీలో కలిపి అనంతరం అయోధ్యకు వెళ్లాడు. తిరిగి రైలులో వస్తుండగా మార్గమధ్యన గుండెపోటు రావడంతో రాము అక్కడిక్కడే మృతి చెందాడు.